# పాపం-సత్యం ★

రచన :
శ్రీ వేముల సత్యనారాయణ.

[ఈ రచన ఒక యువకుడి ప్రత్యక్ష అనుభవాలకు మనస్తత్వ రూపకల్పన. కాని నిజంగా చెప్పాలంటె "లవ్ ఏంగిల్"న నేటి యువతరమునకే ఇదొక సూక్ష్మ ప్రతిరూపము (**MINIATURE**) అని చెప్పవచ్చు.

యవ్వన సహజకోరికలతో యువకులు వివాహాత్పూర్వం "ప్రేమ, ప్రేమ" అంటూ కలవరించడము కద్దు. అయితే అట్టివారిలో అనుకున్న "ప్రేమ"ను పొంది విజయం సాధించిన వారు చాలా అరుదు. దీనికి కారణాలెన్నెన్నో!

ఇది ఒక "సైడ్ లవ్ స్టోరీ! ఒక రకమైన ఆవేదనతో హాస్యరసమును వ్యంగ్యముతో మేళవించి వ్రాశాను. దీనికి కారణము నా యొక్క రెండు ఉద్దేశాలు :-

ఒకటి :-ఇట్టివ్యక్తులను ఎదుటివారు (ప్రేమించబడిన వారు) సానుభూతితో అర్థం చేసుకోవాలనీ-

రెండు :- కేవలం ప్రేమ ఊహాలతో బ్రతుకుతూ, అదే పరమావధిగా భావిస్తూ కాలాన్ని వ్యర్థం చేసుకోగూడదనీ-

నా యీ ఉద్దేశ్యాలు కొంచమైనా సాధించ బడితే నేనెంతో ధన్యుణ్ణి.

—రచయిత.]

★

"పాపం సత్యం" కొందరు కలియుగ వినాయకుల్లాగా సత్యం చెప్పడము పాపమని వ్రాస్తున్నాడనుకొంటున్నారా? అలా అయితే మీరు అపార్థం చేసికొన్నారన్నమాటె! అబ్బే అదికాదండి "సత్యం" అని మా మిత్రుడొకడున్నాడు. వాడి స్థితి చూస్తె పాపమనిపించింది అందుకే "పాపం సత్యం" అంటున్నాను. నేనేకాదు, ఇది చదివాక మీరూ అంటారు. అసలు కథ ఏమిటో చెప్పరాదూ? ఎందుక అలా సాన్చడం అంటున్నారా? సరే అయితే వినండి మా సత్యం కథ:—

అవి నేను బి.యి.డి. ట్రైనింగ్ చేస్తున్న రోజులు అప్పుడు నా క్లాస్‌మేటూ-రూం మేటూ అయిన వ్యక్తియే ఈ కథానాయకుడు సత్యం. పెద్ద చలాకీ కాకున్నను బుద్ధావతార మేమీ కాదు, ఓ రెండు జోకులేస్తే కొందరిలా ముభావంగా ఉండకుండా వారి నవ్వులతో శ్రుతి కలిపి ఆనందించగలడు. రికార్డువర్క్సు అస్సైన్‌మెంట్స్ ఎక్కడికప్పుడు పూర్తిచేస్తూ చక్కగా చదువుకొనేవాడు.

అలా అని "చక్కగా చదువుకొనేవారు ఇతర వ్యవహారాలతో జోక్యం లేనివారు" అనే సామాన్య సూత్రం మావాడి ఎడ వర్తింపజేస్తున్నారా? అయితే మీరు పప్పులో కాలేశారన్నమాటె. మీరన్నట్లు ఈ సూత్రం వాడి ఎడ వర్తిస్తే ఇంత కథ జరుగకనే పోయేది" "పాపం సత్యం" అంటూ ఈ కథ మీ ముందుంచకనే పోయేవాడిని.

చాలా మంది యువకుల్లాగే సత్యం కూడా ఊహాలను సిమెంట్, ఇటుకలతో ఆకాశ హర్మ్యములు నిర్మించుకునేవాడు. ఇంద్ర ధనుస్సులాంటి రంగు రంగుల కలలను తన కళ్ళముందు దర్శించి, తనకే అన్వయించుకుని ఆనందానుభూతి నొందేవాడు.

"ప్రేమ"...అబ్బ! ఎంత కమ్మనిది. తన నిజ జీవితములో ఇటు ప్రేమానుభూతి నొందితే ఎంత బాగుండును? ఏనాటికైనా ప్రేమించే పెళ్ళి చేసుకోవాలి. అట్టి సుందరిని పొంది తోడుగా ప్రేమనౌకపై ఎక్కి సుందరతీరాలను దర్శించాలి. ప్రణయ కడలి అలలలో

మన్నికకు, అహ్లాదానికి...
పంజు టెక్స వారి
* మాస్టర్ * ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84. విశాఖపట్నం-4.

తేలిపోవాలి. అందుకే...అందుకే బాగుగా చదువుకున్న పట్నపు అమ్మాయినే ప్రేమించి పెళ్ళి చేసుకోవాలి. ఏదో వానకాలపు చదువులు చదివిన పల్లెటూరి అమ్మాయిలకేం తెలుస్తాయి ఈ ప్రణయ కలాపాలు?

తొలిరేయి...అవును! ఆ తొలిరేయి పాలగ్లాసు అందిస్తూ చిరుసిగ్గులు చిందిస్తున్న ఆ సుందరి దరికి చేరి చుబుకముపైకెత్తి కళ్ళల్లోకి చూసి "ఓడియమేలా ఓ చెరీ" అని పాడుతుంటె అప్పుడావిడ సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కగా తన ఒడిలో తలజేర్చి, కోకిల స్వరమును తలదన్నునట్లుగా తన పాటకు శృతి కలుపుతుంది. ఆహా ఆ ఆనందము వర్ణనాతీతము మేను పరవశించి పులకించి రోమాంచిత మౌతుంది. అదే పల్లెటూరి అమ్మాయైతే తనలా పరవశించి పాడుతుంటె దరికి వచ్చి ఒడిని చేరే బదులు దయ్యాన్ని చూసినట్లు జడుసుకొని, దూరము జరిగి ఏగాలి సోకిందో అనే గాబరాతో గది తలుపును త్రోసుకుని వెళ్ళి అత్తయ్యా, మామయ్యా అంటూ కేక లేస్తుంది. అందుకే పట్నపు అమ్మాయినే ప్రేమించి పెళ్ళిచేసుకోవాలి. ప్రేమ సుధను గ్రోలాలి, ఇలా అతని ఊహా క్షేత్రములో నాటుకున్న ప్రేమవల్లరి చిగిర్చి, మొగ్గ తొడిగి పుష్పించేది. అందుకే వాడు నెలకు మూడువందలు రూపాయిల స్టైఫండ్ ఇచ్చే ఎన్.ఎం.ఎ. ట్రైనింగ్ సీట్ వచ్చినా విడిచి, ఏదైనా ప్రేమించే ఛాన్సు కలగక పోతుందా? అని బి.ఇ.డి.లో చేరాడు.

సుమ అనే ఓ అమ్మాయి ఉండేది. ఎక్కడో కాదు, మా క్లాస్‌లోనే. గొప్ప సౌందర్యవతి కాకున్నను, పరవాలేదు అందంగానే ఉంటుంది. సన్నగా కవులు వర్ణించే కుసుమ వల్లరిలా ఉంటుంది. ప్రసన్నత నిర్మలత్వము ఆమె ముఖముపై ప్రస్ఫుటంగా కనుపిస్తాది. చదువులో కూడా తెలివైనదే కావడంవల్ల లెక్చరర్లకు కూడా ఆమె అంటె అభిమానము ఏర్పడ్డది.

ఇప్పుడు నేను చెప్పబోయేదేమిటిని ఊహించారు కదండి? అవునండీ! మీ ఊహ కరెక్టే. ఆవిడ మా సత్యంను గాఢంగా ఆకర్షించింది. ఇన్నాళ్ళు తను నిరీక్షిస్తున్న ప్రేమసాగర స్వరూపిణి ఈమెయే అని నిర్ణయించుకున్నాడు. ఇంతదనుక ప్రణయాకాశములో విహరిస్తు తనకు తోడుగా ఒక అస్పష్ట సుందరరూపాన్ని ఊహించుకున్నాడు. కాని ఇప్పుడు తనకు తోడుగా స్పష్టముగా సుమ రూపమే ఊహించుకుని తన మనో విహంగాన్ని విహరింప చేయసాగాడు. కొన్నాళ్ళలా విహరించి, విహరించి వాస్తవస్థితికి వచ్చాడు. "మరి ఎలా ప్రేమను మొదలుపెట్టాలి? అంతవరకు ఆమెతో ప్రత్యక్షంగా మాట్లాడలేదు మాటలు ఎలా మొదలు పెట్టాలి?" అని ఆలోచిస్తూ అంతవరకు తను చదివిన, చూసిన నవలల్లోని, సినిమాల్లోని హీరోల లవ్ డైలాగ్సును స్ఫురణకు తెచ్చుకోసాగాడు. కాని రచయితల కల్పనాచాతురికి నిదర్శనాలయిన ఆ సంఘటనలు నిజ జీవితములో అన్వయించుకోవడానికి అవకాశము లేదని గ్రహించాడు. మరి ఎలా? ఎలా? అనే ఆలోచనా సుళ్ళలో ఇరికిపోయాడు. ఆలోచనలు తుమ్మెదలలో అతని మేధోకుసుమాన్ని తొలచసాగినై.

సత్యం, సాధారణంగా కాలేజీకి తొందరగానే వెళతాడు, ఆనాడు వెళ్ళేసరికి సుమ, ఇంకా కొందరు లేడీస్ కూర్చుని ఏదో పత్రిక చూస్తున్నారు. సుమ కథ పత్రికలో పడింది ద్వితీయ బహుమతి వచ్చింది, అంటూ అప్పుడే వచ్చిన మరో అమ్మాయికి చూపించినారు. అదివిన్న సత్యంలోని ప్రేమ ప్రవాహము మరింత పెల్లుబికింది. కారణమేమంటే వాడికి కూడా కవిత్వముపిచ్చి, కథల పిచ్చి, పత్రికల్లో పడకపోయినా అలా తన సంతృప్తికోరకు వ్రాసుకుంటాడు. తను గాఢంగా ప్రేమించే, ఆరాధించే సుమ కూడా రచయితే, కావడముతో సంతోషసాగరములో ఈదులాడు చుండగా గంటల (కాలేజీ బెల్) కెరటాలు కొట్టివేయగా, తీరానికి వచ్చిపడ్డాడు. ఇక తనికి ఆమెతో మాటలు పెంచుకోవడానికి ఒక ఊత దొరికింది. ఆనాడు కాలేజీ అయినాక సుమ వద్దకు వెళ్ళి "కంగ్రాచ్యులేషన్స్" సుమగారూ!

మీ కథ పత్రికలో ద్వితీయ బహుమతి సంపాదించుకొన్నదట గదా? అన్నాడు. "థాంక్స్" అంది సుమ చిరు మందహాసముతో, "ఏదీ కాస్త ఆ పత్రిక ఇస్తారా? అది చదివి తిరిగి ఇస్తాను" అన్నాడు సత్యం చిరునవ్వును పెదవులపై పులుముకొని "ఓ తప్పకుండా చదివి మీ అభిప్రాయాన్ని కూడా తెలియజేయండి" అంటూ సుమ తన బ్యాగ్ తెరచి పెదవులపై మాయని చిరునవ్వుతోనే తీసి ఇచ్చింది. ఆ క్షణంలో సత్యం పొందిన ఆనందము ఏ కవి కలమునకు సాధ్యం కాదనుకుంటాను. ఆనందమును కొలచే మాపకము ఏదైనా ఉంటే ఆ క్షణములో కొలిస్తే "ఓవర్ రీడింగ్" వల్ల పగిలిపోయేది. అతడా పత్రిక అందుకొని "తప్పక తెలుపుతాను" అంటూ హుషారుగా కదిలాడు.

ఈ విధంగా పరిచయము సంపాదించుకొని రూముకి వెళ్ళి పత్రిక తెరిచి చదివాడు. "వరకట్నము" కథా వస్తువు వైవిధ్యమైన శైలిలో బాగుగా వుంది. ఒక సారి కాదు పదిసార్లు చదివాడు. ఆ కథానిక పేజీలను తన హృదయానికి హత్తుకున్నాడు. "సుమ" అనే పేరును ఉచ్ఛరిస్తూ తీయని అనుభూతి పొందినాడు. సుమను ముద్దులతో ముంచెత్తాడు. (అక్షరాలనే సుమండీ) ఎప్పుడు తెల్లవారుతుందా? తన అభిప్రాయాన్ని తెలుపుతూ ఆమెతో మాట్లాడుతూ ఆమె కలకంఠాన్ని ఎప్పుడు విందామా? అనే ఆతురతో కమ్మని కలలు కంటూ ఆ రాత్రి నిద్రపోయాడు.

మరునాడు కాలేజీకి వెళ్ళాక సత్యం సుమకు ఆ పత్రికను తిరిగిఇస్తూ ఆ కథపైగల తన సదభిప్రాయాన్ని తెలియ జేసాడు. తన భావాలను గూడ జోడించి వరకట్నపు పెరుగు గురించి ఆవేశముగా చెప్పుతూ ఆమె యొక్క ఆదర్శాన్ని మెచ్చుకుంటూ తనుగూడా కట్నం తీసికోకుండానే పెళ్ళిచేసుకుంటానని ప్రతిజ్ఞను చేసినట్లు వెల్లడించాడు. ఇద్దరూ దీని విషయమై కాస్సేపు చర్చించుకున్నారు.

ఇక ఆరోజునుండీ వారిద్దరూ ఎదురుపడితే చిరునవ్వుతో పలకరించుకోవడము, అప్పుడప్పుడు రచనా విషయమై మాట్లాడుకోవడము ప్రారంభమైనది.

ఇక సత్యం పరిస్థితి ఎలా ఉందో అందరూ ఊహించుకోవచ్చు "అసలే కోతి, బాగా కల్లుత్రాగింది, పైగా తేలుకుట్టింది" అన్న సామెతగా వాడికిక ఊహాలే ఆహారమైనవి. వలపు ఊహాలు ముదరడముతో కవిత్వపు పిచ్చి మరీ ముదిరింది. ఎప్పుడూ ఆమెగురించే ఆలోచించేవాడు. "ఓ సుమా! ఈ హృది నీదే సుమా!" అంటూ రకరకాల కవితలతో తన నోటు పుస్తకము నింపేసుకుని ప్రొద్దుపుచ్చేవాడు. కాలేజీకి వెళ్ళి పాఠాలు వింటున్నాడన్నమాటేకాని అతని మెదడునిండా సుమ ఊహాలే. అతని కళ్ళు ముందువరుసలో కూర్చున్న సుమపైనే. అలా ఆమెనే చూస్తే ఎవరైనా చూచి ఏమనుకుంటారోనని కళ్ళను బలవంతంగా ఎంత త్రిప్పుకున్నను "ఊహూ నీమాట మేము వినము" అంటూ అవి ఆమెపైకే తిరిగేవి. లెక్చరర్ ఏమైనా నోట్స్ వ్రాయిస్తుంటే తాను "సుమ-సత్యం" అంటూ పేజీలన్నీ నింపేవాడు.

అసలికన్నీ చెప్పడమెందుకు? పదహారణాల ప్రేమికుడిగా మారాడు. ఇక అతని భౌతికమానసిక స్థితులు "అ" నుండి "క్ష" వరకు మీరే ఊహించుకోండి.

అయితే ఇంత ప్రేమానుభూతులు పొందుతున్నా సత్యం తన ప్రేమ విషయము సుమకు చెప్పడానికి సంకోచించినాడు. "ఒకవేళ చెబితే ఆమెలో ఈ ఉద్దేశ్యము లేకపోతే ఏదో మాట్లాడుతున్నందుకే అపార్థం చేసికొన్నాడని తనని ఎంత నీచంగా భావించుకుంటుంది! ఇక తనతో మాట్లాడనైనా మాట్లాడుతుందా? తనిక ఆమె ముందు తలెత్తుకొని తిరగగలడా? ఆమె చిరునవ్వును నోచుకోనగలడా? నవ్వుతూ తనతో ఎంత బాగా మాట్లాడుతుంది"? ఇవన్నీ ఆలోచించుకొని సత్యం ఒక నిర్ణయానికి వచ్చాడు. సంవత్సర పరీక్షలు అయిపోయినాక తెలుపవలెనని అనుకున్నాడు.

పరీక్షలకు ముందు ఓ నెలరోజులు 'ప్రిపేరింగ్ హాలిడే' ఇచ్చారు. పట్నంలో చదువుసాగదని, ఇళ్ళల్లోనే ప్రశాంతంగా చదువుకోవచ్చునని చాలా మంది స్వంత గ్రామాలకు వెళ్ళిపోయారు. సుమా-సత్యంలు కూడా అడ్రెస్‌లు ఒకరికొకరు ఇచ్చుకొని ఎవరి స్వస్థలం వారు చేరుకున్నారు.

సత్యం చదువుకుంటానని ఇంటికి వెళ్ళినా చదువసలే అతని మనసుకు ఎక్కడము లేదు. అసలతని మనస్సు అతని వద్ద ఉంటేకదా? సుమయే దోచుకున్నది సారీ! సుమ దోచుకోలేదు, సత్యమే ఆమెవైపు పారేశాడు.

అది అందుకొమ్మని చెప్పకలేననేదే అతని ఆరాటం. ఆ ఆరాటము తీరడం కోసం ఆలోచిస్తూ; ఆమెలో తన భవిష్య జీవితాన్ని ఊహిస్తూ పదిహేను అహోరాత్రాలు గడిపాడు.

ఆనాడు—

సత్యం భోజనం చేస్తూవున్నాడు "పోస్ట్" అన్నకేక వినిపించింది. సత్యం తమ్ముడు పోస్ట్ అందుకుని "అన్నయ్యా నీకో కవరు వచ్చింది" అంటూ వచ్చాడు. "ఎక్కడనుండిరా" అని సత్యం అడగ్గా వెనక్కి త్రిప్పి "ఫ్రం సుమా" అని ఉంది అన్నయ్యా అన్నాడు.

అంతే!

సత్యం ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. తను లీలగా ఊహించుకున్నది నిజమయింది. తను తెలుపుకున్నను సుమరో ముందుగా తన ప్రేమను తెలిపింది. అబ్బ! నే నెంత అదృష్టవంతుణ్ణి! అని ఆలోచిస్తూ ఆనందావేశంతో గుండె బయటవారికి వినిపించునట్లుగా కొట్టుకొనుచుండగా అతనికి ఇక ఒక ముద్దకూడా గొంతులోకి దిగలేదు. "ఏమిట్రా ఆ తొందర? తిన్నాక చదువుదువులే!" అని వాళ్ళ తల్లి అంటున్నా వినిపించుకోకుండా చేయి కడుక్కొని లేచి తమ్ముడి చేతిలోని కవర్ అందుకున్నాడు. లోపల వెడ్డింగ్ కార్డ్ మాత్రం ఉంది. గుండె దడదడ మరీ హెచ్చుచుండగా సత్యం సంభ్రమంతో కార్డు చూచాడు.

వధూవరులు "సుమ - సంతోష్ కుమార్" ఇక అంతే!

అతని తల తిరిగి పోయినట్టనిపించింది. ఉన్నట్టుండి. తను నిల్చున్న నేల పాతాళములోనికి కృంగిపోయినట్లయి ఎంత తమాయించుకున్నా కాళ్ళు నిలబడక తెగిన మ్రానులా కూలినాడు.

తరువాత...

కొన్ని గంటలవరకు గాని ఈ లోకంలోకి రాలేదు.

కొన్ని రోజులవరకు గాని మామూలు మనిషి కాలేదు.

ఇక ఆపైన "ప్రేమ" ప్రసక్తి తన మనసులోకి తేలేదు.

★



★

పి. ఎస్. ఆర్. పిక్చర్స్‌వారి

సినిమాస్కోప్ చిత్రం

"అడవిమనుషులు" ఈస్ట్‌మన్

కలర్ చిత్రంలో అనామిక, సుశీల.

★